

# రాఘవేంద్ర కాలనీలో విద్యుత్ స్తంభం కూలి విద్యుత్ స్తంభన

## రాత్రంతా చీకట్లో కాలనీవాసులు చిన్నారులు, వృద్ధులు ఇబ్బంది

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్** :కొండాపూర్ డివిజన్ లో రాఘవేంద్ర కాలనీలోని రాఘవేంద్ర స్వామి దేవాలయం సమీపంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభం నిన్న రాత్రి అకస్మాత్తుగా కూలిపోయింది. దీంతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. స్తంభం కూలడంతో విద్యుత్ లైన్లు దెబ్బతిన్నాయి. భద్రతా కారణాలతో అధికారులు సరఫరా నిలిపివేయడంతో కాలనీలోని వందలాది కుటుంబాలు రాత్రంతా చీకట్లో గడిపారు. వేసవి వేడి, తాగునీరు, మొబైల్ ఛార్జింగ్‌తో పాటు వీధి దీపాలు లేక భద్రతపై కూడా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై కాలనీవాసులు మాట్లాడుతూ.. "నిన్న రాత్రి నుంచి విద్యుత్ లేక చాలా ఇబ్బంది పడుతున్నాం. అధికారులు వెంటనే స్పందించి కూలిన స్తంభాన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేసి విద్యుత్ ఇవ్వాలి" అని కోరారు. కాలనీవాసులు విద్యుత్ శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేసి వెంటనే సరఫరా పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# నేలకొండపల్లిలో వడ్డీ వ్యాపారుల హల్‌చల్

- 'కోట్లు వడ్డీకి ఇచ్చాం.. మా బాకీలు తీర్చండి' అంటూ ఇంటి ముందు బాధితుల దీక్ష
- అనుమతి లేకుండా ధర్నా.. పోలీసుల నిర్లక్ష్యంపై విమర్శలు




**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి, "కోట్ల రూపాయలు వడ్డీకి ఇచ్చాం.. మా బాకీలు తీర్చండి" అంటూ నేలకొండపల్లి మండల కేంద్రంలో ఒక వ్యక్తి ఇంటి ముందు బాధితులు దీక్షకు దిగారు. డబ్బులు ఇచ్చే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ భీష్మించుకు కూర్చోవడంతో స్థానికంగా కలకలం రేగింది. అయితే ఇంటి యజమాని లేని సమయంలో గృహిణి మాత్రమే ఉన్నప్పుడు ఇలా దీక్ష చేయడం, పోలీసులు నామమాత్రంగా వచ్చి వెళ్లడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. నేలకొండపల్లికి చెందిన ఒక వ్యక్తి వద్ద పలువురు కోట్ల రూపాయలు వడ్డీకి ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే కొంతకాలంగా అసలు, వడ్డీ చెల్లించడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. దీంతో గురువారం సుమారు 15 మంది బాధితులు అతని ఇంటి ముందు గుమిగూడి దీక్ష చేపట్టారు. "మేము చెమటోడ్చి కూడబెట్టిన డబ్బు. వడ్డీ ఆశతో ఇచ్చాం. ఇప్పుడు అసలు కూడా ఇవ్వడం లేదు. మా బాకీలు తీర్చే వరకు ఇక్కడే కూర్చుంటాం" అని వారు డిమాండ్ చేస్తున్నారు.ఇక్కడే అసలు మతలబు ఉంది. బాధితులు ఇచ్చిన డబ్బులు చెక్కు రూపంలో ఇచ్చారా? నగదు రూపంలో ఇచ్చారా? అనేది తేలాల్సి ఉంది. లైసెన్స్ లేకుండా వడ్డీకి డబ్బులు ఇవ్వడం నేరం. అసలు ఈ లావాదేవీలను ఆదాయపు పన్ను శాఖకు, ఆడిటింగ్‌లో చూపించారా? ఈ డబ్బు వైట్ మనీయా లేక బ్లాక్ మనీయా? అనేది అధికారులు తేల్చాల్సి ఉంది. ఎలాంటి పత్రాలు లేకుండా కేవలం నమ్మకంతో నగదు రూపంలో ఇస్తే రికవరీ కష్టమని న్యాయ నిపుణులు చెబుతున్నారు.దీక్ష చేస్తున్న సమయంలో ఇంటి యజమాని ఇంట్లో లేడు. కేవలం గృహిణి మాత్రమే ఉన్నారు. ఒంటరి మహిళ ఉన్న ఇంటి ముందు ఇలా గుమిగూడి దీక్ష చేయడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. భయంతో గృహిణి 100కు డయల్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే పోలీసులు నామమాత్రంగా వచ్చి చూసి వెళ్లిపోయారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపణలు వస్తున్నాయి.రోడ్డుపై, ఇంటి ముందు దీక్షలు, ధర్నాలు చేయాలంటే ముందస్తుగా పోలీసు అనుమతి తప్పనిసరి. కానీ ఎలాంటి పర్మిషన్లు లేకుండానే బాధితులు దీక్ష చేస్తున్నారు. మరి అలాంటప్పుడు పోలీసులు ఎందుకు తొలగించడం లేదు అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఒకవైపు అనధికార వడ్డీ వ్యాపారం, మరోవైపు అనుమతి లేని దీక్ష. రెండింటిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని నిలదీస్తున్నారు.నేలకొండపల్లి మండలంలో ఇది ఒక్కటే కాదు. వడ్డీకి డబ్బులు ఇచ్చి తిరిగి కట్టే పరిస్థితి లేకపోవడంతో చాలా మంది ఆస్తులు రాయించుకుంటున్నారని సమాచారం. నెలకు ₹10 నుంచి ₹20 వడ్డీకి ఇస్తూ బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. తెల్ల కాగితాలపై సంతకాలు పెట్టించుకొని, ఖాళీ ప్రోనోట్లపై సంతకాలు తీసుకొని భూములు, ఇళ్లు రాయించుకుంటున్న దందా జోరుగా సాగుతోందని బాధితులు వాపోతున్నారు. పోలీస్ విచారణ వడ్డీకి ఇచ్చిన వారు, తీసుకున్న వ్యక్తి ఇద్దరినీ పిలిచి లావాదేవీల పత్రాలు పరిశీలించాలి. లైసెన్స్ లేని వడ్డీ వ్యాపారంపై కేసు నమోదు చేయాలి రెవెన్యూ శాఖ జోక్యం:★ బలవంతంగా ఆస్తులు రాయించుకున్న కేసులు ఉంటే రద్దు చేసి బాధితులకు న్యాయం చేయాలి.ఆదాయపు పన్ను శాఖ:★ కోట్ల రూపాయల లావాదేవీలు జరిగితే అది బ్లాక్ మనీ కిందకు వస్తుంది. ఐటీ శాఖ విచారణ జరపాలి. లైసెన్స్ లేని వ్యక్తుల వద్ద అధిక వడ్డీ ఆశతో డబ్బులు ఇవ్వొద్దని ప్రజల్లో అవగాహన కల్పించాలి. మొత్తానికి ఈ వివాదంలో తప్పు ఎవరిది, పాపం ఎవరిది అనేది తేలాలంటే జిల్లా అధికారులు వెంటనే స్పందించాలి. లైసెన్స్ లేని వడ్డీ దందాను అరికట్టకపోతే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# చీర్యాల హత్యాయత్నం కేసులో 14 మంది నిందితుల అరెస్ట్



**కీసర, రాజముద్ర న్యూస్:** కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని చిర్యాల గ్రామం, సర్వే నెం.156 భూమి వివాదానికి సంబంధించి నమోదైన హత్యాయత్నం కేసులో ప్రధాన నిందితులు ఏ1 పల్లె భద్రరెడ్డి, ఏ2 బొల్లంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఏ3 పంజా సంజయ్ కుమార్‌లను తేది 07.06.2026 న అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించగా, తదుపరి దర్యాప్తులో భాగంగా ఘటనలో ప్రత్యక్షంగా పాల్గొన్న మరో 14 మంది నిందితులను శనివారం కీసర పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలు: ఏ 4 పందేటి రాజా, ఏ5 బుఖ్య రమేష్, ఏ6 గొల్లేరు నాగరాజు, ఏ7 మరుత రాజశేఖర్, ఏ8 బంధాల ప్రవీణ్, ఏ9 హత్వాల అజయ్ కుమార్, ఏ10 దొంతి నాగ సందీప్, ఏ11 కుంట శ్రీనివాస్, ఏ12 సయ్యద్ అజాం, ఏ13 జమీల్ ఖాన్, ఏ14 అబ్దుల్ నదీం, ఏ15 ధర్మారపు ప్రియాంక, ఏ16 తన్నేరు శ్రావంతి, ఏ17 పిండి సుజాత లుగా నిర్ధారించినట్టు దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం, ప్రధాన నిందితులు ఏ1 పల్లె భద్రరెడ్డి, ఏ2 బొల్లంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఏ3 పంజా సంజయ్ కుమార్‌లతో కలిసి పై నిందితులు భూవివాద నేపథ్యంలో చీర్యాల గ్రామంలోని వివాదాస్పద భూమి వద్దకు చేరుకుని, అక్కడ విధులు నిర్వహిస్తున్న వాచ్‌మన్ గోదుగు సాయికుమార్‌పై, అలాగే అతనిని రక్షించేందుకు వచ్చిన బాధితులు,సాక్షులపై ఇనుప రాడ్లు, హ్యామర్లు, కర్రలు, రాళ్లతో దాడి చేసి తీవ్ర గాయాలు చేస్తున్నట్లు దర్యాప్తులో దారించడం జరిగింది. ఈ ఘటనలో గాయపడిన బాధితుల వాంగ్మూలాలు ప్రకారం ప్రత్యక్ష సాక్షుల ప్రకటనలను, స్వాధీనం చేసుకున్న వస్తువులు,ఇతర సాంకేతిక ఆధారాల ఆధారంగా నిందితుల ప్రమేయం ఉన్నట్లుగా బహిర్గతం అయింది. అనంతరం ఈ కేసులో ప్రత్యేక పోలీసు బృందాలు చాకచక్యంగా నిందితులను గుర్తించి అరెస్ట్ చేసి, న్యాయస్థానం ముందు హాజరు పరచడం జరిగింది. ఈ కేసులో సమగ్ర దర్యాప్తు నిర్వహించిన జవహర్‌నగర్ ఏసీపీ చక్రపాణి, కీసర ఇన్‌స్పెక్టర్ ఆర్కపల్లి ఆంజనేయులు, దర్యాప్తు అధికారి ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి,కీసర పోలీసు సిబ్బందిని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ప్రత్యేకంగా అభినందించారు. అలాగే ఈ కేసులో మరికొంత మంది నిందితులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు. అనంతరం సి.హెచ్. శ్రీధర్, ఐపీఎస్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ మల్కాజ్గిరి జోన్, మల్కాజ్గిరి కమిషనరేట్ మాట్లాడుతూ.. ఎటువంటి సివిల్ లేదా భూ వివాదాలైనా కోర్టులు లేదా రెవెన్యూ చట్టాల పరిధిలో పరిష్కరించుకోవాలి. భూ వివాదాల విషయంలో అసాంఘిక శక్తుల సహాయం తీసుకోవడం, రౌడీల సహాయంతో ప్రత్యర్థి వర్గాలపై దాడులకు పాల్పడడం వంటి చర్యలను పోలీసులు తీవ్రంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటారనీ తెలిపారు. ముఖ్యంగా, భూమి యాజమాన్యంతో ఎటువంటి సంబంధం లేకుండా డబ్బుకు ఆశపడి గొడవల్లో పాల్గొనే వ్యక్తులు చట్టపరమైన చర్యల పరిణామాలను ఎదుర్కొని జైలుపాలయ్యే అవకాశం ఉందనీ ఉంచుకోవాలని అలాగే ఈ కేసులపై సెక్షన్ వారిగా వారి పై రౌడీ షీట్లుగా నమోదు చేయవలసి ఉంటుందని హెచ్చరించారు.

# నేలకొండపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్

## పరిసరాల పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధులకు చెక్: మండల అధ్యక్షులు పొగర్తి సుధాకర్



**ఖమ్మం రాజముద్ర న్యూస్ :** నేలకొండపల్లి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా నేలకొండపల్లి మండల బీజేపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షులు పొగర్తి సుధాకర్ నేతృత్వంలో భక్త రామదాసు మందిరం బజారులో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త చెదారం తొలగించి రోడ్లను శుభ్రం చేశారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షులు పొగర్తి సుధాకర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా పల్లెలు, గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు స్వచ్ఛభారత్ కార్యక్రమం ఉద్యమంలా సాగుతోందన్నారు. గ్రామాలు శుభ్రంగా ఉంటేనే అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు దరిచేరవని, ప్రజలంతా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రధాని కోరుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని, చెత్తను రోడ్లపై వేయకుండా డస్ట్‌బిన్‌లలోనే వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు నున్నా రవికుమార్, మండల ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు, మండల అధికార ప్రతినిధి సూరేపల్లి జ్ఞానరత్నం, మహిళా మోర్చా అధ్యక్షురాలు కందరబోయిన వెంకటరమణ, నాయకులు పుట్టా సత్యనారాయణ, ఎలిగేటి గిరి, పిట్టల సూరిబాబు, కందరబోయిన గోపి, దేశబోయిన వేణుబాబు, ఎలిగేటి వెంకటేష్, అల్లు కృష్ణరావు, పోతనబోయిన శేషగిరి తదితరులు పాల్గొన్నారు

# జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు అందజేసిన జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



**ఖమ్మం రాజముద్ర న్యూస్ :** ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో శనివారం జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రభుత్వం మంజూరు చేసి ప్రింట్ చేసిన అక్రిడిటేషన్ కార్డులను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ చేతుల మీదుగా జర్నలిస్టులకు అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పత్రికా రంగం నాలుగో స్తంభం లాంటిదని అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని కొనియాడారు. సమాజ హితం కోసం నిజాయతీగా, నిర్భయంగా పని చేయాలని సూచించారు. అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు ప్రభుత్వం కల్పించే అన్ని సౌకర్యాలు అందుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు రామ్‌నారాయణ, ఆదినారాయణ, ప్రెసెన్, చారి, బైరం, ప్రసాదరావు, రామారావు, మురళితో పాటు జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి (డీపీఆర్ఓ), పలువురు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రగ్స్ గంజాయి మత్తు పదార్థాలు సేవించడం నేరం

## యువత డ్రగ్స్ గంజాయి మత్తు పదార్థాలు సేవించడం వల్ల కలిగే నష్టాలపై,రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం



**కీసర, రాజముద్ర న్యూస్:** సమాజంలోని యువత డ్రగ్స్, గంజాయి మత్తు పదార్థాలు సేవించడంపై పూర్తి అవగాహన పై సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం జెడ్పిహెచ్ఎస్ గోరంట్ల పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్ శనివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర పట్టణ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రజలకు, యువతకు గంజాయి డ్రగ్స్ మత్తు పదార్థాలు పొగాకు ఉత్పత్తులు సేవించడం వల్ల కలిగే నష్టాలపై, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు గంజాయి వార్తలను యువత సేవించడం వల్ల ఎన్నో శారీరక మానసిక ఆర్థిక సామాజిక అనర్థాలు కలుగుతాయని, యువత వాటికి దూరంగా ఉండి తమను తాము రక్షించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని కోరుకోవడం జరిగింది. యువత ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ప్రణాళిక బద్ధంగా కష్టపడి లక్ష్యాన్ని సాధించి ఈ సమాజంలోని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్కపల్లి ఆంజనేయులు, ఎస్ ఐ, కీసర పోలీస్ స్టేషన్ మాట్లాడుతూ.. రోడ్డు భద్రతా నియమాలు పాటించడంతో ప్రతి ఒక్కరు క్షేమంగా తమ గమ్యాన్ని చేరుకోవాలంటే ద్విచక్ర వాహనాలు నడిపేవారు విధిగా హెల్మెట్ వాడాలని, కారు నడిపే వారు సీట్ బెల్ట్ విధిగా ధరించాలని కోరారు. అవగాహనలో భాగంగా నో డ్రగ్స్.. సేవ్ లైఫ్.. అంటూ కరపత్రాలు పంచుతూ.. ఫ్లెక్సీలు, మైక్ సెట్ ద్వారా ప్రజలకు, యువతకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజలు, యువత కీసర పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

